
# సత్యవాక్కు

## క్రైస్తవ మాస పత్రిక

THE WORD OF TRUTH



# మీకొక సదవకాశము!

క్రీస్తు సంఘములు సమర్పించుచున్న "సత్య వాణి" యను రేడియో కార్యక్రమముద్వారా లక్షలాది ప్రజలు గొప్ప ఆత్మీయ మేలులను పొందియున్నారు. మరికొందరు మేము ప్రచురించిన తెలుగు పుస్తకములద్వారా మేలు పొంది యున్నారు.

మీరు బైబిలు సత్యములను సులువుగా గ్రహించు నిమిత్తము మేము ముద్రించిన సత్యవాణి రేడియో ప్రసంగములు, తదితర పుస్తకములు 25 రకములు మావద్ద ఉన్నవి. అవియేగాక రాబోవు రెండు సంవత్సరములలోను సత్యవాక్య మాసపత్రికను మీరు క్రమముగా పొందవలెనంటే ఈ దిగువ చిరునామాకు రూ. 15/- లు మాత్రము పోస్టేజీ ఖర్చులకు పంపించి మీ పేరు నమోదు చేయించుకొనండి! మీ యింటిలో ఒక మినీ క్రైస్తవ గ్రంథాలయాన్ని తెరవండి!!

**SATYA VANI**
**(P.O. Box 80) Seshagiri Rao St.**
**KAKINADA-533 004**

గమనిక :- మీరు M.O. పంపునప్పుడు, మాకు ఉత్తరములు వ్రాయునప్పుడు, మీ అడ్రసులో మార్పు కలిగినప్పుడు మీ సత్యవాక్య నంబరును మాకు తెలియజేయండి. ఇది అత్యవసరం!!


Razan Electric Press, Kakinada.

# సత్యవాక్యము

**THE WORD OF TRUTH**

P.O. Box 80, KAKINADA, A.P. 533 001

Editor : J.C. CHOATE

Managing Editor : JOSHUA GOOTAM

Pleading for Restoration of First Century Christianity

సంపుటి 12 నవంబరు 1991 సంచిక 4


## సంపాదకీయము

### దురద చెవులు

### ( Itching Ears )

అపొస్తలుడైన పౌలు యౌవన బోధకుడైన తిమోతికి ఈలాగున వ్రాసెను. "దేవుని యెదుటను సజీవులకును మృతులకును తీర్పు తీర్చు క్రీస్తుయేసు ఎదుటను, ఆయన ప్రత్యక్షతతోడు ఆయన రాజ్యముతోడు, నేను ఆన బెట్టి చెప్పునదేమనగా వాక్యమును ప్రకటించుము, సమయ మందును అసమయ మందును ప్రయాసపడుము సంపూర్ణమైన దీర్ఘ శాంతముతో ఉపదేశించుచు ఖండించుము గద్దించుము బుద్ధి చెప్పుము. ఎందు కనగా జనులు హిత బోధను సహింపక దురద చెవులు గలవారై తమ స్వకీయ దురాశలకు అనుకూలమైన బోధకులను తమ కొరకు పోగుచేసికొని, సత్యమునకు చెవి నియ్యక కల్పనా కథల వైపునకు తిరుగు కాలము వచ్చును. అయితే నీవు అన్ని విషయములలో మితముగా ఉండుము, శ్రమ పడుము,

సువార్తికుని పని చేయుము, నీ పరిచర్యను సంపూర్ణముగా జరిగించుము" 2 తిమో 4 : 1-5.

వాక్యమును ప్రకటింపుమని తిమోతిని పౌలు హెచ్చరించుచు, జనులు సత్యమునకు చెవి యియ్యని కాలము వచ్చునని వారు దురద చెవులు కలిగి యుందురని, ఏదో ఒక క్రొత్త సంగతి వినగోరి సత్యమునకు చెవి యియ్యక, కల్పనా కథలవైపు తిరుగుదురని చెప్పెను.

మరొక సందర్భములో పౌలు తిమోతి కిట్లు వ్రాసెను. "అయితే కడవరి దినములలో కొందరు అబద్ధికుల వేష ధారణ వలన మోసపరచు ఆత్మల యందును దయ్యముల బోధ యందును లక్ష్యముంచి, విశ్వాస భ్రష్టు లగుదురని ఆత్మ తేటగా చెప్పుచున్నాడు. ఆ అబద్ధికులు వాత వేయబడిన మనస్సాక్షి గలవారై, వివాహము నిషేధించుచు సత్య విషయమై అనుభవ జ్ఞానము గల విశ్వాసులు కృతజ్ఞతా స్తుతులు చెల్లించి పుచ్చుకొను నిమిత్తము దేవుడు సృజించిన ఆహార వస్తువులను కొన్నిటిని తినుట మానవలెనని చెప్పుచుందురు. దేవుడు సృజించిన ప్రతి వస్తువు మంచిది. కృతజ్ఞతా స్తుతులు చెల్లించి పుచ్చుకొనిన యెడల ఏదియు నిషేధింప తగినది కాదు. ఏలయనగా అది దేవుని వాక్యము వలనను ప్రార్థనల వలనను పవిత్ర పరచబడు చున్నది" (1 తిమో 4:1-5). అట్టి కాలము వచ్చునని అప్పుడు సత్యము నకు దూరమై అబద్ధ బోధల వైపునకు తిరిగి మానవ కల్పిత బోధల యందు లక్ష్య ముంచుదురని పౌలు చెప్పిన మాట గమనించండి.

ఎఫెసీ పెద్దలను పౌలు హెచ్చరించుచూ "దేవుడు తన స్వరక్తమిచ్చి సంపాదించిన తన సంఘమును కాయుటకు పరిశుద్ధాత్మ మిమ్మును దేనియందు అధ్యక్షులనుగా ఉంచెనో ఆ యావత్తు మందను

గూర్చియు మీ మట్టుకు మిమ్మును గూర్చియు జాగ్రత్తగా ఉండుడి. నేను వెళ్ళి పోయిన తరువాత క్రూరమైన తోడేళ్ళు మీలో ప్రవేశించునని నాకు తెలియును. వారు మందను కనికరింపరు మరియు శిష్యులను తమ వెంట ఈడ్చుకొని పోవలెనని వంకర మాటలు పలుకు మనుష్యులు మీలోనే బయలు దేరుదురు. కావున నేను మూడు సంవత్సరములు రాత్రింబగళ్లు కన్నీళ్లు విడుచుచు ప్రతి మనుష్యునికి మానక బుద్ధి చెప్పితినని మీరు జ్ఞాపకము చేసికొని మెలకువగా ఉండుడి" (అ. కా. 20:28-31) అని చెప్పెను. ఈ సందర్భములో పౌలు సత్యమును నమ్మకముతో బోధించి తన సహోదరులను నమ్మకముగా నుండవలెనని ప్రోత్సహించి, క్రూరమైన తోడేళ్లు మందను తినివేయుటకు లేక ప్రభువు ప్రజలను మోసగించుటకు ప్రవేశించునని హెచ్చరించెను. సంఘములో సభ్యులుగా నుండి కూడ అబద్ధ బోధలను ప్రారంభించి శిష్యులను తమ వెంట ఈడ్చుకొని పోవుదురని పౌలు హెచ్చరించెను.

పౌలు ఏథెన్సులో బోధించు సందర్భములో క్రీస్తు పునరుత్థానమును గూర్చి బోధించెను. "ఎపికూరీయులలోను స్తోయికులలోను ఉన్న కొందరు జ్ఞానులు అతనితో వాదించిరి. కొందరు ఈ వదరబోతు చెప్పునది ఏమిటని చెప్పుకొనిరి. అతడు యేసును గూర్చియు, పునరుత్థానమును గూర్చియు ప్రకటించెను గనుక మరికొందరు వీడు అన్య దేవతలను ప్రచురించుచున్నాడని చెప్పుకొనిరి. అంతట వారు అతని వెంటబెట్టుకొని అరేయొపగు అను సభ యొద్దకు తీసుకొని పోయి-నీవు చేయుచున్న ఈ నూతన బోధ యెట్టిదో మేము తెలిసికొనవచ్చునా? కొన్ని క్రొత్త సంగతులు మా చెవులకు వినిపించుచున్నావు గనుక వీటి భావమేమో మేము తెలిసికొన గోరుచున్నామని చెప్పిరి. ఏథెన్సు వారందరును అక్కడ నివసించు పరదేశులును ఏదో ఒక క్రొత్త సంగతి చెప్పుటయందును వినుట యందును మాత్రమే తమ కాలము గడుపు

చుండువారు" (అ.కా. 17:18-21). ఏదైనా క్రొత్త సంగతి వినవలెననెడి ఆశ కలిగిన ఏథెన్సు ప్రజలు పౌలు బోధయందు లక్ష్యముంచిరను విషయము గమనించవలసి యున్నది.

విశ్వాసులు మరియు అవిశ్వాసులు దేవుని సత్యములతో సంతృప్తి చెందక వారు యింతకు ముందు వినని క్రొత్త సంగతుల కొరకు ఆసక్తి కనపరచుచున్నారు. దురద చెవులు కలిగి యుండుట అంటే ఇదే. క్రీస్తు కొన్ని సార్లు వినుటకు చెవులు గలవాడు వినును గాక అని చెప్పెను. వారు వినకపోయినట్లయితే వారు అంగీకరించలేదని ఆయన భావము. దురద చెవులు అంటే సత్యమైన బోధ విషయమై విసిగి ప్రభువు మార్గమును ప్రశ్నించుట మరియు మానవ కల్పిత బోధలకు అవకాశ మిచ్చుట. ఈ విషయమై ఆశ్చర్యపడవలసిన పని లేదు. ప్రతి తరము నందు ఇది జరుగుచున్నది. ఈ దినాలలో ఒక బోధనుండి మరొక బోధకు తరచూ మారే కొందరిని మనం చూస్తూ ఉన్నాము. ఇది వాక్యానుసారము కాదు. అయినప్పటికిని ఇట్టి స్థితి కొనసాగుచున్నది.

సంఘమునందు కూడ బైబిలు నందలి పాతవైన ప్రాథమిక సత్యములను విని కొందరు విసుగు చెందుచున్నారు. నూతనమైన, ఆహ్లాదకరమైన విషయములను వినుట యెడల తమ ఆసక్తిని కనబరచుచున్నారు. మరొక బోధకుడు వేరే పంథాలో బోధించినప్పుడు వారికి ఆసక్తి కలుగవచ్చును. వారు యింతకు ముందు వినని అంశములపై ప్రసంగములను వినుటకు ఆసక్తిని కలిగియుంటారు. యిది క్షేమాభివృద్ధి కొరకు, జ్ఞానము కొరకు, యోగ్యత కొరకు, తమ జీవితాలకు వాటిని అన్వయించుకొనుట కొరకు, యితరులకు బోధించుటకొరకు కాదు. అది వినోదము కొరకు మాత్రమే. ఇది ప్రమాదము. యెరూషలేములో అందింపబడిన సువార్త మరియు మనము నిలిచియున్న గొప్ప

సత్యము విషయమై వినికి నట్లయితే మనము అబద్ధ బోధలకు స్థానము కల్పించిన వారమై అబద్ధ బోధలలోనికి త్వరగా నడిపింపబడుదుము. ఈ విధమైన తిరోగమనము నాశనకరమైన ఫలితముల నిచ్చును.

నా సహోదరులారా, స్నేహితులారా లేఖనములయందు యివ్వబడిన హెచ్చరికల విషయములో జాగ్రత్తను కలిగి యుందము. మనకేది ఉత్తమమో ప్రభువునకు తెలియును. సత్యమునకు బదులుగా యివ్వబడిన మరొక విషయమేదీ లేదు. దేవుని వాక్యాధారము లేని విషయములను గూర్చి మనము ఆలోచించవలసిన పనిలేదు. యేసు చెప్పిన మాట వినండి. "యేసు నేనే మార్గమును, సత్యమును, జీవమును నాద్వారానే తప్ప యెవడును తండ్రియొద్దకు రాడు" (యోహా. 14:6) అని చెప్పెను.

---

## పరిశుద్ధాత్మ బాప్తిస్మము

( గత పంచిక తరువాయి )

క్రొత్త నిబంధన ప్రవేశ పెట్టబడక ముందే పరిశుద్ధాత్మ బాప్తిస్మము నెరవేర్చబడింది. కొందరు తేలిగ్గా తలంచు చున్నట్టు, పరిశుద్ధాత్మ బాప్తిస్మము మాటి మాటికి జరిగేది కాదు. ఈ సంగతి ఎలాగున్నా, అపొ. కా. 10 లో, కొర్నేలి యింట జరిగింది కూడా పరిశుద్ధాత్మ బాప్తిస్మమే నని కొందరి భావన! పరిశుద్ధాత్మ బాప్తిస్మము కాలతలో యూదుల మీదికి ఒక సారి, అన్య జనుల మీదికి మరియొక సారి వచ్చినట్టు వారు అభిప్రాయ పడుచున్నారు. అభిప్రాయం మంచిగా వున్నా, అది దేవుని సంకల్పానికి సరిపోయేదో లేదో కూడా ఆలోచించ వలసిన అవసర ముంటుంది. గనుక పరిశీలించి చూద్దాం. అలా

చేసేటప్పుడు ఆ రెండు సంభవాల్లోని వ్యత్యాసాలను ముందుగా గమనించుదాం.

1. పేతురు కొర్నేలి యింట బోధిస్తూ వుండగా— "అతని బోధ విన్నవా రందరి మీదికి పరిశుద్ధాత్మ దిగెను" అని వ్రాయబడి యుంది (అపొ. 10:44). పెంతెకొస్తు దినానికీ, కొర్నేలి యింట జరిగిన దానికీ మధ్య వ్యత్యాసాన్ని గుర్తించావా? అక్కడైతే బోధించే లేక మాట్లాడే వారి మీదికే పరిశుద్ధాత్మ దిగివచ్చాడు. ఇక్కడైతే వినేవారి మీదికే ఆయన దిగివచ్చాడు. 2. పెంతెకొస్తు దినాన అవిశ్వాసులైన వారికి విభ్రాంతి కలిగేలా పరిశుద్ధాత్మ అగ్ని జ్వాలల వంటి నాలుకలుగా విభాగింపబడి వారిలో ఒక్కొక్కని మీద వ్రాలగ వారు చూచారు; వారి మాటలు తమ తమ భాషల్లో విన్నారు. - కొర్నేలి యింట నైతే - పేతురు వెంట వచ్చిన యూదుల్లోని విశ్వాసులు విభ్రాంతి నొందునట్లు అన్య జనుల మీదికి పరిశుద్ధాత్మ దిగి వచ్చాడు (అపొ. 10:44). 3. పెంతెకొస్తు దినాన పరిశుద్ధాత్మను పొందిన వారు గాక; పరిశుద్ధాత్మను పొందనివారే నీటి బాప్తిస్మము పొందారు; కొర్నేలి యింట నైతే పరిశుద్ధాత్మను పొందిన వారే నీటి బాప్తిస్మము పొంద నాజ్ఞాపింప బడ్డారు (అపొ. 10 : 47, 48). తక్కిన భేదాలను వదలి వేద్దాం.

## బాప్తిస్మము ఒక్కటే

అయితే అక్కడా, యిక్కడా కూడా సామాన్యగా జరిగింది - భాషలు మాట్లాడటం. దాన్ని ఆధారం చేసుకొని పేతురు - "మనవలె పరిశుద్ధాత్మను పొందిన వీరు (కొర్నేలి యింటివారు) బాప్తిస్మము పొందకుండ ఎవడైనా నీళ్ళకు ఆటంకము చేయగలడా అని చెప్పి - యేసుక్రీస్తు నామమందు వారు బాప్తిస్మము పొందాలని ఆజ్ఞాపించాడు (10:48).

జాగ్రత్తగా గమనించు: క్రొత్త నిబంధనకు సంబంధించిన బాప్తిస్మము ఒక్కటే (ఎఫెసీ 4 : 4). అది-ప్రభువైన యేసునందు విశ్వాసముంచి, మూర్ఖులగు ఈ తరము వారికి వేరై, యేసు సజీవుడగు దేవుని కుమారుడైన క్రీస్తు అని ఒప్పుకొని, పాప క్షమాపణ నిమిత్తం పొందే నీటి బాప్తిస్మము (అపొ. 2:38-41). పై చెప్పబడిన వాటిల్లో, తేడా వస్తే అది క్రొత్త నిబంధన బాప్తిస్మముగా ఎంచబడదనుకో! (అపొ. 19 : 1-5).

## కొర్నేలి యింట జరిగిందేమి ?

ధర్మశాస్త్రానికి బదులు, దాని స్థానంలో క్రొత్త నిబంధన ప్రవేశపెట్టబడి, అప్పటికి రమారమి ఐదారేండ్లు జరిగినట్టుంది. అయినా యూదులకు ధర్మశాస్త్రపు మత్తు వదలనట్టుంది. దానివలననే తాము చేస్తున్న పరిచర్యలో అన్యజనులకు పాలు లేదని వారు భావిస్తున్నారు. క్రొత్త నిబంధనలో అన్యజనులు యూదులతో సమాన వారసులనే సంగతి అప్పటిలో విశ్వాసులకు గ్రహింపు కానట్టుంది.

అదంతా ఎందుకు? క్రొత్త నిబంధన ప్రారంభోత్సవములో ప్రముఖ పాత్రను వహించిన పేతురు దగ్గరకే వద్దాం. అతడు ప్రసంగిస్తూ "ఈ వాగ్దానము మీకును మీ పిల్లలకును, దూరస్థులందరికిని, అనగా ప్రభువైన మన దేవుడు తన యొద్దకు పిలిచిన వారికందరికిని చెందును" అని అన్నాడు (అపొ. 2 : 38, 39). అయినా అన్యజనులకు సువార్త ప్రకటించడానికి అతడు వెనుకంజవేసాడు; వెరచాడు (అపొ. 10:25-28). "సమస్త జనులను శిష్యులుగా చేయుడి" అన్న ప్రభువు ఆజ్ఞను మరిచాడు (మత్తయి 28:18).

పునరుత్థానుడైన ప్రభువు అపొస్తలుల మీద ఊది పరిశుద్ధాత్మను పొందుడి" అని అన్న తరువాత—"మీరు ఎవరి పాపములు

క్షమింతురో అవి వారికి క్షమింపబడును; ఎవరి పాపములు నిలిచియుంచ నిత్తురో వారి పాపములు నిలిచి యుండునని" వారితో చెప్పారు (యోహాను 20 : 23). అంటే పరిశుద్ధాత్మను పొందిన అపొస్తలుల బోధ ద్వారా మాత్రమే పాప క్షమాపణ, లేక రక్షణ మార్గం ప్రజలకు అందింప బడుతుందని ఆయన స్పష్టం చేసారు. వారి బోధ ఎక్కడ ప్రకటింపబడ లేదో, అక్కడ ప్రజలకు పాపం నిలిచియుంటుందని దాని భావం.

గనుకనే తాను భక్తిపరుడై, తనయింటి వారందరితో కూడ దేవుని యందు భయ భక్తులు గలిగి ప్రజలకు బహు ధర్మ కార్యములు చేస్తూ, ఎల్లప్పుడు దేవుని ప్రార్థించే కొర్నేలికి, అతని యింటి వారికి అపొస్తలుల బోధ అవసరం. పేతురే అన్య జనుల్లో కూడా సువార్త ద్వారాలు తెరవాలి. కొర్నేలి ప్రార్థిస్తున్నప్పుడు, దేవ దూత తన యింట నిలిచి - అతడును అతని యింటి వారును ఏ మాటల వలన రక్షణ పొందుదురో, ఆ మాటలను తెలియజేయ డానికి పేతురును పిలిపించుకోమని ఆజ్ఞ ఇచ్చి పోయాడు (అపొ. 11 : 14). ఈ సందర్భంలో దేవుడు జోక్యం పుచ్చుకొని పేతురుకు దర్శన మిస్తే, ధర్మ శాస్త్ర సంబంధమైన నీతి పలుకులతో అతడు దాన్ని నెట్టివేయ జూచాడు (10:9-15). అంతలో పేతురును తన యింటికి పిలిపించు కొనుటకు కొర్నేలి యొద్దనుండి యిద్దరు మనుష్యులు రానే వచ్చారు. మరునాడు అతడు వారి వెంట వెళ్ళినా, అన్య జాతి వానితో సహవాసం చేయుట యైనను వానిని ముట్టుట యైనను యూదునికి ధర్మం కాదంటూ, యింకా వెనుకా, ముందూ కొట్టబడు తున్నట్టే ప్రసంగం ప్రారంభించాడు. ఆ సందర్భంలో అన్య జనులు యూదులతో పాటు సమాన వారసులును, ఒక్క శరీరంలోని సాటి అవయవములును, వాగ్దానంలో పాలివారునై యున్నారనే

# ఆహ్వానము

## కాకినాడ స్కూల్ ఆఫ్ ప్రీచింగ్

నిర్వహించుచున్న

## గొప్ప బైబిలు సెమినార్

ప్రసంగికులు : **Bro.** పెర్రి బి. కోతమ్ (అమెరికా)

తేదీలు : 1991 డిశంబరు 3వ తేదీ సాయంత్రము నుండి
8వ తేదీ సాయంత్రం వరకు

సమయం : ప్రతిరోజు ఉదయం 10 గంటలకు
మధ్యాహ్నం 3 గం॥లకు
సాయంత్రం 6-30 గం॥లకు

స్థలము : క్రీస్తు సంఘము-సత్యవాణి (బెయిలీ బిల్డింగ్)
7-9-35, సాంబమూర్తి వీధి,
(కుళాయిచెర్వు ఎదురుగ్గా-పశువుల ఆసుపత్రి దగ్గర)
రామారావు పేట, కాకినాడ-4.

అన్ని సంఘముల బోధకులు, సభ్యులు రావచ్చును. దేవుని వాక్యం విని విధేయులు కావచ్చును. ఉచిత భోజన వసతి సౌకర్యం కలదు. మీరు తప్పక రండి ! మీ మిత్రులతో కలసి రండి. గొప్ప ఆత్మీయాహారమును భుజించి వెళ్ళండి.

**వివరములకు :**
నెహెమ్యా గూటం, డైరక్టర్
పోస్టు బాక్సు నం. 57, కాకినాడ - 533 001
ఫోన్ : 0884 – 74882

# Kakinada School of Preaching

cordially invites you to a

## GREAT BIBLE SEMINAR

with

**Bro. PERRY B. COTHAM, U.S.A.,**

Dates : 1991 December 3rd p.m. to 8th p.m.
(Tuesday to Sunday)

Time : 10-00 a.m., 3-00 p.m. and 6-30 p.m.

Place : CHURCH OF CHRIST - SATYAVANI
(Bailey Building)
7-9-35, Sambamurthy Street,
Near Veterinary Hospital, Ramaraopet,
KAKINADA-533 004.

All Preachers of Church of Christ and denominations are invited. Free food and accommodation are available. Please come and Bring Your Friends.

For more information contact :

NEHEMIAH GOOTAM, Director,
P.O. Box 57, Kakinada-533 001.

Phone : 0884 - 74882

(ఎఫెసీ 3 : 6) వాస్తవాన్ని స్థాపించడానికే, క్రీస్తునందు ముందుగా విశ్వాసులైన యూదులకు విభ్రాంతి కలిగించేలా, పరిశుద్ధాత్మ కొర్నేలి యింట శ్రోతలపైకి దిగి వచ్చాడు.

గనుక పరిశుద్ధాత్మ బాప్తిస్మము ఒక్కటే. అది పెంతెకోస్తు దినమున అపొస్తలులకు, అటు తరువాత కొర్నేలి యింటివారికి యివ్వబడింది. పెంతెకోస్తు అనే పేరుతో ఈ మధ్య మత శాఖలు ప్రారంభమయ్యాయి. వీటికి బైబిలుకు సంబంధం లేదు. వాటి లోతుకు పోకుండా పైపైన ఆలోచన చేస్తేనే ఈ సంగతి తేటబడుతుంది.

1. ఆనాటి పెంతెకోస్తు యూదుల పండుగ దినం (అపొ. 2:1). ఈనాడు పెంతెకోస్తు ఏ దినమూ కాదు. 2. ఆనాటి పెంతెకోస్తు దినమున యెరూషలేములో క్రీస్తు సంఘం ఏర్పడింది (అపొ. 11 : 22); ఈనాడు పెంతెకోస్తుకు ఏ సంఘం ఏర్పడిందో! 3. యెరూషలేములో అపొస్తలులు ప్రభువు చేసిన వాగ్దానం కొరకు కనిపెట్టి, పరిశుద్ధాత్మ బాప్తిస్మము పొందారు; ఈనాటి వారు కనిపెట్టడానికి ఏవిధమైన వాగ్దానము లేదు. 4. అపొస్తలులు కూడి యున్న స్థలానికి పరిశుద్ధాత్మ తానే నేరుగా పైనుండి శబ్దం చేసుకుంటూ, జనులను ఆకర్షించుకొంటూ వచ్చాడు (అపొ. 2:1-3); నేడు పరిశుద్ధాత్మ అలా రాడు! గనుక వారి కూడికల్లో వారే అల్లరి చేసుకొంటూ, శరీర సంబంధమైన తమ మనస్సు చేత ఊరకే ఉప్పొంగుతూ వుంటారు. 5. అపొస్తలులు పెంతెకోస్తు దినమున తాము నేర్చుకొనని, యితరులకు అర్థమయ్యే భాషల్లో మాట్లాడారు (2:6-9). ఈనాటి జనం ఏమి మాట్లాడుతున్నారో వారికే తెలియని పలుకులు పలుకుతారు. 6. పరిశుద్ధాత్మ బాప్తిస్మము పొందిన పేతురు నడుస్తున్నప్పుడు అతని నీడ పైబడితేనే రోగులందరూ స్వస్థత పొందారు (అపొ. 5 : 15-16). వారెప్పుడు

స్వస్థత కూటాలు పెట్టలేదు; నేటి జనం స్వస్థత కూటాలని పెట్టినా జనులను మోసగించడానికే ఆ పని జరిగిస్తున్నట్టున్నారు. గనుక నేటి పెంతెకోస్తువారి విషయం జాగ్రత్త! దేవుడు ఏ కార్యాన్నైనా తన సంకల్పం ప్రకారమే జరిగిస్తాడు!!

—G. దేవదాసం, పెరంబూరు, మద్రాసు-12.

---

## ఆత్మానుసారు లెవరు ?

ఆత్మానుసారులనగా శరీరేచ్ఛలను నెరవేర్చని వారని అర్థము. శరీరాత్మల కలయికయే మానవుడు. దేవుడైన యెహోవా నేల మంటితో నరుని నిర్మించి వాని నాసికా రంధ్రములలో జీవ వాయువును ఊదగా నరుడు జీవాత్మ ఆయెను (ఆది 2 : 7). క్షయమైన ఈ శరీరములో దేవుడు ఊదిన జీవాత్మ ఉన్నంత వరకే ప్రతి వ్యక్తికి విలువ, గౌరవము. జీవాత్మ శరీరాన్ని విడిచి వెళ్ళగానే మనిషి యొక్క శరీరానికి అస్సలు విలువ, గౌరవము ఉండదు. మట్టినుండి పుట్టి మరల మట్టికి చేరేది శరీరము. దేవుని వలన అనుగ్రహింపబడి దేవుని యొద్దకు చేరేది ఆత్మ. ఈ దినములలో అనేకులు విశ్వాసములో పాతుకు పోయామని చెప్పినా శరీరాశలను విసర్జించకుండా ఉన్నారు. వీరిని గూర్చి దైవ లేఖనములు ఇట్లు హెచ్చరిస్తున్నాయి: "శరీరానుసారులు శరీర విషయములమీద మనస్సునుంతురు. ఆత్మానుసారులు ఆత్మ విషయములమీద మనస్సునుంతురు. శరీరానుసారమైన మనస్సు మరణము. ఆత్మానుసారమైన మనస్సు జీవమును సమాధానమునై యున్నది. ఏలయనగా శరీరానుసారమైన మనస్సు దేవునికి విరోధమై యున్నది. అది దేవుని ధర్మశాస్త్రమునకు లోబ

షడు. ఏమాత్రమును లోబడ నేరదు కాగా శరీర స్వభావము గల వారు దేవుని సంతోషపరచ నేరరు. ...ఎవడైనను క్రీస్తు ఆత్మ లేని వాడైతే వాడాయన వాడు కాడు" (రోమా 8:5-9). కనుక మనము ఆత్మానుసారులము కావాలంటే ఆత్మ చేత శారీర క్రియలను చంప వలెను. ఎందుకనగా దేవుని ఆత్మ చేత మనము నడిపించబడి నప్పుడు ఆయన కుమారులుగా కుమార్తెలుగా ఉండు అర్హత కలిగియుందుము. అలా కాక మనము శరీరానుసారముగా ప్రవర్తించిన యెడల మర ణాన్ని పొందుట తథ్యం (రోమా 8:13-14).

## లోకాశలు

భక్తుడైన యోహాను లోకాశలను గూర్చి చక్కగా వివరిం చాడు. లోకములో ఉన్న దంతయు, అనగా శరీరాశయు, నేత్రాశయు, జీవపు డంబమును తండ్రి వలన పుట్టినవి కావు. అవి లోకసంబంధ మైనవే. లోకమును దాని ఆశయు గతించి పోవుచున్నవి. గాని, దేవుని చిత్తమును జరిగించువాడు నిరంతరము నిలుచును (1 యోహా 2 : 16-17).

ప్రియ మిత్రులారా ఆదికాండము 39 అధ్యాయము పఠించిన యాకోబు కుమారుడైన యోసేపు రూపవంతుడు, సుందరుడునై యుండి పోతీఫరను నొక ఐగుప్తీయుని ఇంటిమీద విచారణ కర్తగా యుండెను. పోతీఫరు భార్య యోసేపుపై కన్ను వేసి తనతో శయ నించు మని యోసేపును పలుమార్లు కోరెను. కాని యోసేపు ఆమె కోరికను అంగీకరించ లేదు. ఒకవేళ ఆమె కోరికను అంగీకరించినచో యోసేపుకు భౌతిక సంపదలు, అధికారము లభించును. అక్రమ విధా నముతో లభించు భౌతిక సంపదలు లేక అధికారములను యోసేపు తృణప్రాయముగా నెంచి దేవునికి భయపడెను. పోతీఫరు తన భార్య

కల్పిత మాటలు విని మండిపడి యోసేపును చెఱసాలలో వేసెను. యెహోవా చెరసాలలో యోసేపుకు తోడై యుండెను. మరియు దావీదు కుమారుడు, జ్ఞానియైన సొలొమోను రాజు పరస్త్రీలను మోహించి కామాతురత గలవాడై వారి ప్రోత్సాహముతో కెమోషు అను మోయాబీయుల హేయమైన దేవతకును మొలెకు అను అమ్మోనీయుల హేయమైన దేవతలను పూజించి తన హృదయమును దేవుని యొద్దనుండి తొలగించుకొని ఆయన కోపమునకు గురి అయ్యెను. శరీరానుసారమైన వాంఛలకు లోనై విలువైన ఆత్మానుసారమైన జీవితమును నాశనము చేసుకొనెను (1 రాజులు 11 : 1-4).

మనము సొలొమోను వలె ఆత్మీయముగా బలహీనులము కాకుండుటకై జారత్వము, అపవిత్రత, కాముకత్వము, విగ్రహారాధన, అభిచారము, ద్వేషములు, కలహము, మత్సరములు, క్రోధములు, కక్షలు, భేదములు, విమతములు, అసూయలు, మత్తతలు, అల్లరితో కూడిన ఆట పాటలు మొదలైన శరీర కార్యములు విడిచిపెట్టి ప్రేమ, సంతోషము, సమాధానము, దీర్ఘ శాంతము, దయాళుత్వము, మంచితనము, విశ్వాసము, సాత్వీకము, ఆశా నిగ్రహములను అలవరచు కొందము. ఇట్టి వాటికి విరోధమైన నియమమేదియు లేదు. క్రీస్తు యేసు సంబంధులు శరీరమును దాని యిచ్ఛలతోను దురాశలతోను సిలువవేసి యున్నారు (గలతీ 5 :19-24). ఎందుకనగా శరీరము ఆత్మకును ఆత్మ శరీరమునకును విరోధముగా అపేక్షించును. ఇవి యొకదాని కొకటి వ్యతిరేకముగా ఉన్నవి గనుక మీరేవి చేయ నిశ్చయింతురో వాటిని చేయకుందురు అని అపొస్తలుడైన పౌలు నుడివెను (గలతీ 5:16-18, రోమా 7:14-21, 25, రోమా 6:12-14).

మరియు మనము మట్టినుండి పుట్టినవాని పోలికను ధరించిన

ప్రకారము పరలోక సంబంధి (క్రీస్తు) పోలికను ధరింతుము (1 కొరింథీ 15:44-49, 1 కొరింథీ 5:7-8). దేవుని కృపను పొందకుండ తప్పిపోవు నేమో అనియు, చేదైన వేరు ఏదైననూ మొలిచి కలవర పరచుట వలన అనేకులు అపవిత్రులై పోవుదురేమో అనియు, ఒక పూట కూటి కొరకు తన జ్యేష్టత్వపు హక్కును అమ్మివేసిన ఏశావు వంటి భ్రష్టుడైనను వ్యభిచారి యైనను ఉండునేమో అనియు, జాగ్రత్తగా చూచుకొనుడి. ఏశావు ఆ తరువాత ఆశీర్వాదము పొందగోరి కన్నీళ్లు విడుచుచు దాని కోసరము శ్రద్ధతో వెదకినను, మారుమనస్సు పొంద నవకాశము దొరకక విసర్జింప బడెనని మీరెరుగుదురు (హెబీ 12:15-17). ప్రతి వ్యక్తి ఆత్మానుసారునిగా జీవించవలెనంటే వాక్యం విని, విశ్వసించి క్రీస్తును ఒప్పుకొని, పాపక్షమాపణ నిమిత్తం బాప్తిస్మము పొంది, దైవ కృప కలిగి వినయ భయభక్తులతో దేవునికి ప్రీతికరమైన సేవ చేయాలి. ఏలయనగా మన దేవుడు దహించు అగ్నియై యున్నాడు (హెబీ 12:28-29). శరీర కార్యములను చేసినచో శరీర వాంఛలను విడువనిచో మనము ఎట్టివారమైననూ అగ్ని గంధకములతో మండు గుండములో పడుట తప్పదు (ప్రకటన 21:8, 27, యూదా 1:6-7). క్రీస్తు సంఘము లన్నియు మీకు వందనములు చెబుచున్నవి.

—పి. చంద్రశేఖర్, క్రీస్తు సంఘం, ధవళేశ్వరం.

—o—

## మీ పోరాటము ఎవరితో - దేనికొరకు?

### I మానవుల సాధారణ పోరాటములు

"మీలో యుద్ధములును పోరాటములును దేనినుండి కలుగుచున్నవి? మీ అవయవములలో పోరాడు మీ భోగేచ్ఛల నుండియే గదా?" (యాకో 4:1).

అందుకే జనము మీదికి జనము రాజ్యము మీదికి రాజ్యము దేశము మీదికి దేశము లేచి జరుపుచున్న భీకర పోరాటములను గూర్చి తరచు వినుచున్నాము. పూర్వమందు తన తమ్మునికి విరోధంగా పోరాడిన కయీను అను వాడొక డుండెను. "...వాడు దుష్టుని సంబంధియై తన సహోదరుని చంపెను; వాడతని ఎందుకు చంపెను? తన క్రియలు చెడ్డవియు తన సహోదరుని క్రియలు నీతిగలవనియునై యుండెను గనుకనే గదా?" (1 యోహా 3 : 12).

మరియు యెహోవా యెదుట పరాక్రమము గల వేటగాడు అను పేరుగాంచిన నిమ్రోదను వాడొకడు దేవునికి విరోధంగా అనేక కార్యములు చేపట్టి విఫలుడాయెను (ఆది కా.10:8-9).

## II ఆత్మకు విరోధంగా జరిగే పోరాటము

మేలైనది చేయవలెనను కోరిక నాకు కలుగుచున్నది గాని దాని చేయుట నాకు కలుగుట లేదు. కారణం - నా యందు నివసించు పాపమే. కాబట్టి మేలు చేయగోరు నేను కీడు చేయనపుడు వేరొక నియమము నా అవయవములలో ఉన్నట్టు నాకు కనబడుచున్నది. అది నా మనస్సునందున్న ధర్మశాస్త్రముతో పోరాడుచు నా అవయవములలో నున్న పాప నియమమునకు నన్ను చెతపట్టి లోపరచుకొను చున్నది (రోమా 7:18-24).

"ప్రియులారా మీరు పరదేశులును యాత్రికులునై యున్నారు గనుక ఆత్మకు విరోధముగా పోరాడు శరీరాశలను విసర్జించుడి" (1 పేతు 2 : 11).

## III దేవుని ఆశీర్వాదముల కొరకు పోరాటం

దేవునితోను మనుష్యులతోను పోరాడిన యొక మనుష్యు డుండెను. అతని పేరు యాకోబు. అతడు దేనికొరకు పోరాడెను? "నీవు నన్ను ఆశీర్వదించితేనే గాని నిన్ను పోనియ్యను" అని పట్టుదలతో దేవునితో పెనుగు లాడెను. దేవుడు అక్కడ అతని నాశీర్వదించెను. యాకోబు తన పోరాటములో తొడ గూడు వసలిపోయినను పట్టు విడువక గెలుపొందు వరకు పోరాడెను (ఆది కా. 32:24-30).

"సహోదరులారా నేను యూదయలో నున్న అవిధేయుల చేతులలోనుండి తప్పింపబడి యెరూషలేములో చేయవలసి యున్న ఈ పరిచర్య పరిశుద్ధులకు ప్రీతికర మగునట్లును, నేను దేవుని చిత్తము వలన సంతోషముతో మీ యొద్దకు వచ్చి, మీతో కలసి విశ్రాంతి పొందునట్లును, మీరు నా కొరకు దేవునికి చేయు ప్రార్థనల యందు నాతో కలసి పోరాడవలెనని మన ప్రభువైన యేసుక్రీస్తును బట్టియు, ఆత్మ వలన ప్రేమను బట్టియు మిమ్మును బతిమాలుకొను చున్నాను" (రోమా 15:30-32).

"మీలో ఒకడును క్రీస్తు యేసు దాసుడునైన ఎపఫ్రా మీకు వందనములు చెప్పుచున్నాడు. మీరు సంపూర్ణులును, ప్రతి విషయ ములో దేవుని చిత్తమును గూర్చి సంపూర్ణాత్మ నిశ్చయత గల వారునై నిలకడగా ఉండవలెనని యితడెల్లప్పుడును మీ కొరకు తన ప్రార్థనలలో పోరాడుచున్నాడు" (కొల 4:12).

క్రీస్తు సంఘస్థులు వ్యక్తిగతంగాను, సంఘముగాను తమ ప్రార్థన లందు పోరాడుచూ, దేవుని వాగ్దానములను స్వతంత్రించుకొని క్షేమాభి వృద్ధి పొందుట దేవుని చిత్తము (అ.కార్య. 4 : 23-31, రోమా 12:11-12).

## IV పరిశుద్ధులకు అప్పగింప బడిన బోధ నిమిత్తము పోరాడాలి

"ప్రియులారా మన కందరికి కలిగెడు రక్షణను గూర్చి మీకు వ్రాయవలెనని విశేషాసక్తి గల వాడనై ప్రయత్న పడుచుండగా, పరిశుద్ధులకు ఒక్కసారే అప్పగింపబడిన బోధ నిమిత్తము మీరు పోరాడవలెనని మిమ్మును వేడుకొనుచు మీకు వ్రాయవలసి వచ్చెను. ఏలయనగా కొందరు రహస్యముగా చొరబడి యున్నారు. వారు భక్తి హీనులై మన దేవుని కృపను కామాతురత్వమునకు దుర్వినియోగ పర్చుచు, మన అద్వితీయ నాధుడును ప్రభువునైన యేసుక్రీస్తును విసర్జించు చున్నారు. ఈ తీర్పు పొందుటకు వీరు పూర్వమందే సూచింప బడినవారు" (యూదా 1:3-4).

ఈ పోరాటము ఒక బోధ నిమిత్తము చేయవలసిన పోరాటమై యున్నది. అది ఎవరి బోధయై యున్నది? - క్రీస్తు బోధ. అది ఎవరికి అప్పగింపబడెను? - పరిశుద్ధులకు. పరిశుద్ధులనగా ఎవరు?-దేవుడు తన స్వరక్తమిచ్చి సంపాదించిన తన సంఘము. అది ఎన్నిసార్లు అప్పగింప బడెను? ఒక్కసారే. అది ఎప్పుడు అప్పగింపబడెను? మొదటి శతాబ్దములో, 27 పుస్తకములు గలిగిన క్రొత్త నిబంధన గ్రంథము వ్రాయబడు చున్నప్పుడు. అదిఎట్లు అప్పగింపబడెను? - లేఖనములుగా అప్పగింపబడెను.

### లేఖనములలో గల క్రీస్తు బోధ నిమిత్తము పోరాడాలి :

లేఖనములు సాక్ష్యమిచ్చు చున్నవి: లేఖనములను పరిశోధించుడి (యోహా 5 : 39). "క్రీస్తు బోధయందు నిలిచి యుండక దాని విడిచి ముందునకు సాగు ప్రతివాడు దేవుని అంగీకరింపనివాడు. ఆ బోధయందు నిలిచి యుండువాడు తండ్రిని కుమారుని అంగీకరించువాడు.

ఎవడైనను ఈ బోధను తేక మీ యొద్దకు వచ్చిన యెడల వానిని మీ యింట చేర్చుకొనవద్దు; శుభమని వానితో చెప్పవద్దు. శుభమని వానితో చెప్పువాడు వాని దుష్ట క్రియలలో పాలివాడగును (2 యోహా : 9-11).

## క్రీస్తు బోధ

క్రీస్తు - నేను చేయు బోధ నాది కాదు; నన్ను పంపినవానిదే. ఎవడైనను ఆయన చిత్తము చొప్పున చేయ నిశ్చయించుకొనిన యెడల, ఆ బోధ దేవుని వలన కలిగినదో, లేక నా యంతట నేనే బోధించుచున్నానో వాడు తెలిసికొనును (యోహా 7:16-17). క్రీస్తు తండ్రియైన దేవుని దగ్గరనుండి తీసికొని వచ్చిన బోధను లోకములో బోధించెను. అయితే క్రీస్తు తండ్రి దగ్గర విన్నివ, లేక తెచ్చిన సంగతులన్నియు తన శిష్యులకు బోధించలేదు. శిష్యులు అప్పటిలో సహించలేరని కొన్ని సంగతులను మాత్రమే వారికి బోధించెను (యోహా 16 : 12).

పిమ్మట క్రీస్తు పరమునకు చేర్చుకొనబడిన తరువాత ఆదరణ కర్తయైన పరిశుద్ధాత్మ వచ్చినపుడు ఆయన అనగా పరిశుద్ధాత్మ శిష్యులకు సమస్తమును బోధించి, క్రీస్తు చెప్పిన మాటలను వారికి జ్ఞాపకము చేయునట్లు నియమించెను (యోహా 14 : 25-26). అంత మాత్రమే కాదు "ఆయన అనగా సత్యస్వరూపియైన ఆత్మ వచ్చినపుడు మిమ్మును సర్వసత్యము లోనికి నడిపించును. ఆయన తనంతట తానే ఏమియు బోధింపక, వేటిని వినునో వాటిని బోధించి సంభవింపబోవు సంగతులను మీకు తెలియ జేయును. ఆయన నావీటిలోనివి తీసికొని మీకు తెలియజేయును గనుక నన్ను మహిమ పరచును. తండ్రికి కలిగిన వన్నియు నావి, అందుచేత ఆయన నావాటిలోనివి

తీసికొని మీకు తెలియ జేయునని నేను చెప్పితిని" (యోహా 16 : 13-15).

పరలోక మందున్న తండ్రియైన దేవుని యొద్ద నుండి తీసికొని వచ్చిన బోధ తండ్రి చిత్త ప్రకారము అపొస్తలులకు కొంత మట్టుకు మాత్రమే బోధించెను. సమస్తమును బోధించి అపొస్తలులను సర్వ సత్యములోనికి నడిపించుటకును, క్రీస్తు చెప్పిన సంగతులను జ్ఞాపకము చేయుటకును పరిశుద్ధాత్మకు బాధ్యతను అప్పగించెను.

మరియు క్రీస్తు పునరుత్థానుడైన తరువాత పరమునకు చేర్చు కొనబడక ముందు చివరి సారిగా శిష్యులను కలుసుకొని క్రీస్తు ఈలాగు ఆజ్ఞాపించెను. "మీరు యెరూషలేమునుండి వెళ్ళక, నావలన వినిన తండ్రి యొక్క వాగ్దానము కొరకు కనిపెట్టుడి; యోహాను నీళ్ళతో బాప్తిస్మ మిచ్చెను గాని కొద్ది దినములలోగా మీరు పరిశుద్ధాత్మలో బాప్తిస్మము పొందెదరనెను" (అ.కా. 1:4, 5).

మరియు ఆయన వారితో ఇంకను ఈలాగు చెప్పెను. సమస్త జనులను నాకు శిష్యులనుగా చేయుడి... నేను మీకు ఏయే సంగతులను ఆజ్ఞాపించితినో వాటి నన్నిటిని గైకొనవలెనని వారికి బోధించుడి (మత్త 28 : 19-20).

ఆలాగే వారు కనిపెట్టి పరిశుద్ధాత్మను పొందిరి. ఆ దినమందు యెరూషలేములోని ఆయన బోధ వినిన యూదులలో నుండి మూడు వేల మంది బాప్తిస్మము పొందిరి (అపో.కా. 2:1-4, 38-42). అదే క్రీస్తు నా సంఘమును కట్టుదునని మత్త 16:18లో వాగ్దానము చేసిన తన సంఘము. క్రీస్తు తన సంఘమును కట్టిన మొదటి రోజునుండే సంఘము అపొస్తలుల బోధ యందు ఎడతెగక యుండిరి (అపో. కా. 2 : 42).

పరిశుద్ధాత్మ వలన సమస్తము బోధింపబడినవారై సర్వ సత్యములోనికి నడిపింపబడినవారై సంఘమునకు సర్వసత్యము బోధించుచు క్రీస్తు బోధయందు వారిని స్థిరపరచుచుండెను.

ఈలాగు సంఘములు సంఖ్యలో స్థానికంగా అభివృద్ధి చెందుటే గాక స్థానిక సంఘములు భూలోక మంతట విస్తరించుచుండెను.

అదే సమయములో అపొస్తలులు, ఆత్మ వరములు పొందిన పరిచారకులు లేని సమయాల్లో సంఘము లోనికి దుర్బోధకులు రహస్యముగా ప్రవేశించి భిన్నమైన బోధ చేయుచు సంఘములను కలవర పరచుచుండెడి వారు (గల 2:4, యూదా 1:4, అ.కా. 15:24, రోమా 16 : 17-18).

సామాన్య సభ్యులు కలవరము చెందినను అపొస్తలులు పరిచారకులు వారి అబద్ధ బోధను ఖండించి సత్యవాక్యమును బోధించే వారు (1 తిమో 6 : 3, గల 1:6-9). (సశేషము)

—పాల్ గూటం, గొల్లవిల్లి.

---

## ప్రేమించు కాపరి

### (The Loving Shepherd)

"యెహోవా నా కాపరి" యను 23వ దావీదు కీర్తనను బైబిలును ప్రేమించువారు బాగుగా ఎరిగియే యుందురు. ఆ కీర్తన చాల మందికి ఇష్టము కూడా. గొర్రెల యెడల వాటి కాపరికున్న సంబంధముతో పోల్చి తన ప్రజల యెడల దేవునికున్న ప్రేమానురాగములు అందు వర్ణించబడినవి.

దేవుని ప్రేమను మనకు వర్ణించడానికి బైబిలు అనేక దృశ్య

ములను మన యందుంచు చున్నది. కుమ్మరి తన చక్రముపై చక్కటి పాత్రను సృష్టించుట దీనికొక దృష్టాంతము (యిర్మి 18 : 1-6). ఒక నిర్మాణికుడు ఒక భవనమును నిర్మించుటలో కావలసిన ప్రశస్తమైన రాళ్ళను ఎట్లు ఎంచుకొంటాడో అట్లే దేవుడు తన ఆత్మీయ మందిరాన్ని సజీవమైన రాళ్ళతో నిర్మించాడు (1 కొరి 3 : 10-11). తప్పిపోయిన కుమారుని యెడల తండ్రికున్న ప్రేమ వలె దేవుని ప్రేమ మన యెడల ఉన్నది. తన వధువు యెడల భర్త ఎట్టి ప్రేమను కలిగి యుంటాడో దేవుడు మన యెడల అట్టి ప్రేమను కలిగి యున్నాడు (లూకా 15 : 11-24; ఎఫెసీ 5 : 25-27). అయితే 23వ కీర్తనలో వర్ణించబడిన కాపరివంటి దేవుని ప్రేమ అతి సౌందర్యమైనది.

యేసు ప్రభువుకు కూడ ఈ కీర్తన అంటే చాల యిష్టమనే చెప్పుకోవాలి. ఏలయనగా తానొక మంచి గొర్రెల కాపరి నని, గొర్రెల నిమిత్తము తన ప్రాణమును కూడ పెట్టెదనని ఆయన మనకు బోధించాడు (యోహాను 10:11, 12).

## యెహోవా నా కాపరి

భూమ్యాకాశములను ఎవరు సృజించారో (ఆది. కా. 1 : 1), ఈ విశ్వాన్నంతటనీ తన శక్తిచొప్పున ఎవరు చలింపచేయుచున్నారో, తన సంకల్పము జరుగులాగున జనాంగముల మధ్య, ప్రజల మధ్య ఎవరు పని చేయుచున్నారో, తన వాక్యముద్వారాను మరింత విశేషముగా తన కుమారుని ద్వారాను ఎవరు తన్ను తాను బయలు పరచుకొన్నారో అట్టి యెహోవా నా కాపరి. అట్టి గొప్ప శక్తి సామర్థ్యములు గల దేవుడు తన మార్గదర్శి యని దేవుని వెంబడించు వానికి నిర్ధారణ ఇయ్యబడి యున్నది. ఆయన అతనికి ప్రేమపూర్వకమైన ఆదరణ నొసగును.

'నా కాపరి' యనుటలో వ్యక్తిగత సంబంధము వ్యక్తమగు

చున్నది. 23వ దా. కీర్తనలోని మాధుర్యమంతా దానిలో ప్రకటింప బడుచున్న వ్యక్తిగత సంబంధంలో వ్యక్తమగుచున్నది. నీవు ఆయన గొర్రెలలో ఒకటవైతే యెహోవా నీ కాపరి, యెహోవా నా కాపరి కూడాను.

కాపరి యొక్క నడిపింపు మీదను, జాగ్రత్తలోను గొర్రెలు ఆధారపడి యుంటాయి. అవి సులభంగా భయపడ్తాయి. ప్రమాదాన్ని తప్పించుకొనుటకు ఒక మందగా పరుగెడతాయి. నాయకుని అవి స్వనా యాసంగా వెంబడిస్తాయి. వాటియొక్క భుక్తి, రక్షణ వగయిరాలన్నీ కాపరి యొక్క జాగ్రత్త మీదనే ఆధారపడి యుంటాయి.

ప్రభువు కాపరియై యుండగా వ్యక్తిగత అవుసరాలన్నీ తీరు తాయి. "నాకు లేమి కలుగదు". అవుసరాలన్నిటిని తీర్చు కాపరిని వెంబడించు ఆత్మీయ గొర్రెల అనుభవం యిది.

పూర్తిగా సంతృప్తి జెందేవరకు మేత మేయుటకు పచ్చికగల చోట్లు కలవు. గొర్రెలు సులభముగా భయపడునవి గనుక అలజడి యున్న జలముల యొద్దకు నీరు త్రాగుటకు రావు. గనుక శాంతికర మైన జలములు వాటి కున్నవి. దేవుని ప్రజలు భుజించడానికి ఆత్మీ యాహారమైన దేవుని వాక్యమున్నది. వారి ప్రార్థనా ప్రవాహములే శాంతికరమైన జలములు.

## నా ప్రాణమునకు ఆయన సేద దీర్చుచున్నాడు

గొర్రెల వలె మనందరము త్రోవ తప్పిపోతాము. దేవుని ప్రేమయొక్క గొప్ప నిదర్శనమే ఆయన క్షమాపణ, మనలను వెదకి ఆయన దొడ్డిలో మరల చేర్చుటకు ఆయనకున్న ఆసక్తి. వంద గొర్రె లను గూర్చి యేసు చెప్పిన ఉపమానము దీనిని చిత్రీకరించుచున్నది (లూకా 15:3-7). మంచి కాపరివలె ప్రభువు తన ప్రజలను ఎల్ల

కేళలా నీతి మార్గములలో నడిపించును. ఆయన నాయకత్వము వలన వారెన్నడు భయపడరు.

## గాఢాంధకారపు లోయ

ప్రతి మానవుని జీవితము చివరకు గాఢాంధకారపు (మరణ) లోయ గుండా పయనించ వలసిందే. మనము ఈ లోయలో ఏకాకిగా పయనించవలసిందే. వెళ్ళుచున్న వారు మన కెంత ప్రియులైనను వారి కూడా మనం వెళ్ళలేము. ఈ లోయలో సంచరించునపుడు ప్రభువు ఒక్కడు మాత్రమే మనతో యుంటాడు గనుక ఏ అపాయమునకు భయపడము. "నీ దుడ్డు కర్రయు, నీ దండమును నన్ను ఆదరించును". ఆయన నన్ను పోషించాడు, నా దాహం తీర్చాడు, నా ప్రాణానికి సేదదీర్చాడు, పునరుద్ధరించాడు గనుక అంతిమ విజయం సాధించే వరకు ఆయన గాఢాంధకారపు మరణలోయలో నాతో సంచరించును.

## సిద్ధపరచబడిన భోజనం

ఒక శ్రేష్ఠమైన గృహ యజమానివలె నా శత్రువుల యెదుట ఆయన నాకు పసందైన భోజనము సిద్ధపరచును. ఆయన కాపరినుండి, శ్రమలనుండి వేరుగా సిద్ధపరచిన విందు యజమాని వలె ఇక్కడ వర్ణించబడ్డాడు. "నా గిన్నె నిండి పొర్లు చున్నది".

## ఫలితం?

దేవుని ప్రేమను ఈ రీతిగ వర్ణించిన తరువాత కీర్తనల గ్రంథ కర్త (గాయకుడు) 23వ కీర్తనను ఈ దిగువ విశ్వాస నిర్ధారణ మాటలతో ముగించుచున్నాడు: "నేను బ్రదుకు దినములన్నియును కృపా క్షేమములే నా వెంట వచ్చును. చిరకాలము యెహోవా మందిరములో నేను నివాసము చేసెదను". తన ప్రజల జీవితకాలములో దేవుని ప్రేమ వారి చుట్టూ ఆవరించుకొని యుండుటయే గాక, నిత్యత్వంలో మహిమను, ఆనందాన్ని ప్రసాదిస్తాది. —డెల్లా పెక్

—o—

# క్రీస్తు సంఘము యొక్క ఔన్నత్యము

సంఘము క్రీస్తు సంఘము
వాస్తవమైనది వన్నె కెక్కినది
భక్తుల సంఘమే ప్రభుని శరీరం
రక్తవిలువతో రాజ్యమైనది,

వాక్యోదకములో స్నానముచేసి
సత్యవ్రతులతో సంధించబడె
ఒకే బోధలో విశ్వాసములో
శిరస్సుకు లోబడి జీవించుచున్నది ॥

కన్యను బోలిన క్రైస్తవ సంఘము
కాంక్షించుచున్నది కాపరి యేసుని
ఏ క్షణమైనను యెదుర్కొన గలనని
దీక్షను బూని వీక్షించుచున్నది ॥

మానవ కల్పిత బోధలు మరచి
ఉన్నత దేవుని వాక్యము తరచి
రక్షణ మార్గము ప్రకటన సేయుచు
లక్ష్యము నెరిగి శ్రమించుచున్నది ॥

సంఘమె దేవుని నిజ రాజ్యము
శాశ్వత కాలము నిలుచును సంఘము
సంఘము కొరకై వచ్చును యేసు
సంఘ రహితులకే శాశ్వత నరకము ॥

—ఎస్. జె. మేడిది, కొణితివాడ.

## ఇది నీకు తెలుసా ?

నీకు తెలుసో లేదో గాని పేదవానిగా నుండుట చాల మంచిది.

నీవు ఐశ్వర్యవంతుడవా ? కొన్నిటిలో నీవు ధనవంతుడవు కావచ్చును. నీవు పుష్టిగా శరీరారోగ్యము గలిగియుండినను అనేక మందిచే గౌరవింప బడుచుండినను నీవు ధనవంతుడ వని చెప్పవచ్చును. నివసించుటకు చక్కటి యిల్లు, తినుటకు కావల సినంత ఆహారము సమృద్ధిగా వుండినను నిన్ను ధనవంతుడనే పిలువ వచ్చును.

అధిక ధనము కలిగియుండుట లేక భాగ్యవంతునిగా యుండుట మంచిదని నీవనుకొనుచున్నావా? అట్లనుకొనుట సహజమే! అయితే అది చాల అనర్థాలకు సమస్యలకు దారితీయునని బైబిలు చెప్పుచున్నది. ముఖ్యముగా మత్తయి 19:24లో "ధనవంతుడు పరలోకరాజ్యములో ప్రవేశించుట కంటె సూది బెజ్జములో ఒంటె దూరుట సులభమని" యేసు చెప్పెను. అనగా ధనవంతుడు దేవుని రాజ్యములో ప్రవేశిం చుట ఎంతో కష్టమని ఒక్కొక్కసారి అసాధ్యమనికూడ అర్థమిచ్చు చున్నది గదా! ఇదే సందేహమును శిష్యులు క్రీస్తును ఆశ్చర్య ముతో అడిగినట్లు ఆ క్రింది వచనములో చదువగలము (19 : 25). "ఆలాగయితే ఎవరు రక్షణ పొందగలడని..." (మత్తయి 19 : 25).

అయితే యేసుక్రీస్తు దానికి జవాబుగా 26వ వచనములో ఈవిధ ముగా చెప్పెను : "ఇది మనుష్యులకు అసాధ్యమే గాని దేవునికి సమ స్తమును సాధ్యమని చెప్పెను". అయితే దేవునియందు విశ్వా సముతో ఆయనపై భారముంచినట్లయితే నీకు అసాధ్యమయినది ఏదీ ఉండదని అర్థమగుచున్నది. మార్కు 10:24లో యేసుక్రీస్తు యిట్లు చెప్పెను : "తమ ఆస్థియందు నమ్మకముంచువారు దేవుని రాజ్యములో ప్రవేశించుట ఎంతో దుర్లభము".

ధనవంతుడై యుండుట చాల హానికరమని, చెడ్డదని, కష్టతర మైనదని బైబిలు గ్రంథము చాల స్పష్టముగా చెప్పుచున్నది. నీకు భోగభాగ్యములు లేకున్న విచారింపకుము. దేవునియందు విశ్వాస ముంచుము, మంచివాటిని గూర్చి యోచించి సమకూర్చుకొనుము. పరలోకమందు నీ ధనమధికము చేసుకొనుము. —మేరీ ఏన్ డేవిస్

—o—

# సంక్షిప్త వార్తలు

పునరుద్ధరణ ఉద్యమము తరువాత ఆంధ్రప్రదేశ్ లో మొట్ట మొదటి క్రీస్తు సంఘ సభ్యులు డెల్టా ప్రాంతపు వాసులగుట వలన ఈ ప్రాంతమునకు ఒక ప్రత్యేకత ఉన్నది. 1964వ సంవత్సరమందు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రములో పునరుద్ధరింప బడిన క్రొత్త నిబంధన సత్యము డెల్టా ప్రాంతమునుండి రాష్ట్రమంతటికిని విస్తరించెను. డెల్టా ప్రాంతపు క్రీస్తు సంఘములు మరియు బోధకులు దేవుని మహిమార్థ మైన పని జరిగించుట ఆయా ప్రాంతములలోని బోధకులకు ప్రోత్సా హకరముగ నున్నది. వారు ఈ మాదిరి ననుసరించి సమావేశమై రాత్రి బహిరంగ సువార్తకూటములు కూడ జరిపించి అనేక ఆత్మలను ప్రభువు నొద్దకు నడిపించుచున్నారు.

గ్రంథమునందలి అర్థముకాని పాఠములను అనుభవనీయులైన సువార్తికులు విపులీకరించుచున్నారు. లేఖనములు అపార్థము చేసికొన కుండ సత్యవాక్యమును సరిగ ఉపదేశించువారిగ బోధకులు ఈ కర్మా గారములో పదును పెట్టబడుచున్నారు.

అక్టోబరు నెల బోధకుల సమావేశము 17వ తేదీ గురువారం ముంగండలో జరిగెను. ఊహించని విధముగ సుమారు 70 మంది సువా ర్తికులు హాజరై ఆత్మీయానందమును పొందిరి మధ్యాహ్నం 2 గంIIలకు "సత్యవాక్యమును సరిగ విభజించుట ఎట్లు?" అను ప్రాముఖ్యమైన అంశము చర్చింపబడెను. ఈ చర్చలో సోదరులు జాషువాగూటంగారు

వి. చిన్నయ్యగారు, యస్. రామకృష్ణారావుగారు, పాల్ గూటంగారు మరియు పి.జె. కృపాలినిగారు మరియు E.K.V. ప్రసాదరావుగారు పాల్గొనిరి.

రాత్రికూటము ప్రశాంత వాతావరణములో అత్యానందదాయకంగా ప్రారంభమయ్యెను. సోదరులు ఇ. కె.వి. ప్రసాదరావుగారు, పాల్ గూటంగారు, పి. యస్. రావుగారు వాక్యమును అందించిరి. సోదరులు జాషువా గూటంగారు "ఈ జీవితకాలము మట్టుకే మనము క్రీస్తునందు నిరీక్షించు వారమైన యెడల మనుష్యులందరికంటె దౌర్భాగ్యులమై యుందుము" 1 కొరింథీ 15:19 అను వచన భాగమును హృదయమునకు హత్తుకొను విధముగ బోధించిరి. ఈ ప్రసంగము స్థానిక సంఘమునకు క్షేమాభివృద్ధి కలుగజేసెను. విశ్వాసులు తమ విశ్వాసమందు బలపడుటకు ఈ కార్యక్రమము ప్రయోజనకర మాయెను.

ఒక హైందవ స్త్రీ బాప్తిస్మము పొందెను. సోదరులు స్థానిక సంఘ బోధకులు Ch. జాన్‌బాబుగారు, వారి సోదరులు Ch. భూషణంగారు కార్యక్రమమును సమర్థవంతముగా నిర్వహించిరి.

---

Regd. No. H/KD—45, KD H.O.

From
SATYA WAKKU
P.O. Box 80
KAKINADA 533 001

No.

To
..............................
..............................
..............................
..............................